## చదువు.. నిద్ర ఒకే గదిలో..!

● అడిషనల్ కలెక్టర్‌కు సమస్యలు ఏకరువు పెట్టిన కేజీబీవీ విద్యార్థినులు



తరగతి గదిలోనే విద్యార్థుల లగేజీ.. పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 3 : చదువుకోవడానికి, నిద్రించడానికి అఖరికి బట్టలు మార్చుకోవడానికి కూడా ఒకే గది వాడుతున్నామని పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి స్థానిక కేజీబీవీ విద్యార్థినులు మొర పెట్టుకున్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఏసీ వీరారెడ్డి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట సామగ్రి, వాష్ రూమ్, తరగతి గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు గేటు లేదని, వాష్ రూమ్‌లు సరిపోవడం లేదని, తరగతి గదులు సరిపడా లేవని, ఉపాధ్యాయులు కావాలని, డార్మేంటరి, డైనింగ్ హాల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏసీకి విన్నవించుకున్నారు.

# అన్నదాతకు దోఖా

## సూర్యాపేట జిల్లాలో రుణమాఫీ కాని రైతులు లక్షకు పైనే!




జిల్లాలో పంట రుణాలు తీసుకున్న రైతులు **2.53** లక్షలు

రుణాల మొత్తం **3,012** కోట్లు

రుణమాఫీ పొందిన రైతులు **1,15,553**

రుణమాఫీ జరిగిన నిధులు **969** కోట్లు

### నాలుగో విడుత జాబితాలోనూ కనిపించని పేర్లు

### సీఎం ప్రకటనపై అన్నదాతల ఆగ్రహం

### రూ.2లక్షల పైబడిన వారికి రుణమాఫీ లేనట్టే!

సూర్యాపేట, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : నాలుగో విడుత రుణమాఫీతో వంద శాతం రుణమాఫీ పూర్తయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించగా, నేటికీ మాఫీకి నోచని రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. సూర్యాపేట జిల్లాలో ఇంకా లక్ష మందికిపైనే రుణమాఫీ కావాల్సి ఉన్నట్లు అంచనా. జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో 2.15 లక్షల మంది రైతులు రూ.3వేల కోట్ల వరకు వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. కాగా, నాలుగు విడతలు కలిపి కేవలం 1,15,533 మంది రైతులకు రూ.969 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. ప్రధానంగా నాలుగో విడతలో కేవలం డెబిట్ ఫెయిల్యూర్ కేసులు ఉన్న 15,009 మంది రైతులకు రూ.132 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. నాలుగో విడుతలోనూ పేరు రాని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షల పైన రుణం రైతులకు మాఫీపై స్పష్టత లేకపోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు.



వానకాలం సీజన్ ముగిసింది. యాసంగి సీజన్‌లోనైనా పంట రుణాలు తీసుకుందాంలే అనుకున్న రైతులకు నాలుగో విడత రుణమాఫీ జాబితా నిరాశ పరిచింది. గత మూడు నెలల నుంచి అదిగో.. ఇదిగో రుణమాఫీ అంటూ చెప్పుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నిండా ముంచింది. 2 లక్షల లోపు రుణం ఉన్న వేలాది మంది రైతులకు వివిధ కారణాలతో రుణమాఫీ కాలేదు. డెబిట్ ఫెయిల్యూర్ కేసులను గుర్తించి రేషన్‌కార్డు ఎడిట్, ఆధార్, బ్యాంకు అకౌంట్‌లో తప్పులు పూర్తి చేసినా వారి పేరు సైతం నాలుగో విడుత జాబితాలో లేకపోవడం శోచనీయం. రూ.50వేల లోపు నుంచి లక్షన్నర లోపు రుణాలు ఉన్న రైతులకు కూడా మాఫీ కాకపోవడం గమనార్హం. రెండు రోజులుగా రుణమాఫీ కాని వేలాది మంది రైతులు తమ పేరు జాబితాలో ఎందుకు రాలేదో చెప్పాలని జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

### రూ.2లక్షలపై రుణం ఉన్న రైతుల సంగతేంటి?

సీఎం ప్రకటనతో రెండు లక్షలకుపై రుణాలు ఉన్న రైతుల పరిస్థితి ఏంటనేది తెలియని పరిస్థితి నెలకొంది. సొసైటీలో ఒక విధంగా, బ్యాంకుల్లో మరో విధంగా, వ్యవసాయాధికారులో ఇంకోలా చెబుతుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రెండు లక్షలకు పైన అప్పు ఉన్న వారు పైన ఉన్న డబ్బులు చెల్లిస్తేనే రుణమాఫీ జరుగుతుందని గతంలో చెప్పడంతో అప్పటికప్పుడు మిగిలిన సొమ్మును అప్పు చేసి మరీ కట్టారు. అప్పటి నుంచి ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురైంది.

### మాఫీ కాని వారు లక్షకు పైనే..

నాలుగో విడుత రుణమాఫీ జాబితా విడుదలైనప్పటికీ జిల్లాలో దాదాపు లక్షకు పైనే మంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదని తెలుస్తున్నది. జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు దాదాపు 2.15 లక్షల మంది ఉన్నారు. నాలుగు విడతలు కలిపి జిల్లాలో కేవలం 1,15,533 మంది రైతులకు మాత్రమే మాఫీ అయ్యింది. నాలుగో విడతలో కేవలం డెబిట్ ఫెయిల్యూర్ కేసులను మాత్రమే పరిగణలోకి తీసుకుని నిధులు విడుదల చేశారు. ఇన్నాళ్లు రేషన్ కార్డు, ఆధార్ తప్పులు, బ్యాంకు అకౌంట్ నెంబర్‌లో తేడా అంటూ సాకులు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్నీ సరిచేశాక కూడా ఎందుకు రుణమాఫీ చేయలేదని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. రెండు లక్షలకు పైనే రుణం ఉంటే పైనగదు చెల్లిస్తే మాఫీ అవుతుందని చెప్పి.. ఇప్పుడు మోసం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.

### నయా పైసా మాఫీ కాలేదు



వంద శాతం రుణమాఫీ అన్న ప్రభుత్వం మాట ఒట్టిదే. గుడిబండ గ్రామంలోని సర్వే నెంబర్ 25కు చెందిన పట్టా పాస్‌బుక్ పెట్టి రూ.2లక్షల పంట రుణం తీసుకున్నాం. ప్రభుత్వం అన్నట్లు నాకు ఇంత వరకు నయా పైసా కూడా మాఫీ కాలేదు. సీఎం మాటలు విని బ్యాంకుకు పోయి చూసుకున్నాం. రుణమాఫీ కాలేదు. ప్రభుత్వానివి ఒట్టిమాటలే. చేతల్లో సున్నా. నాతోపాటు మా ఊరి చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు.

**- యరగాని శ్రీనివాస్‌గౌడ్, రైతు, గుడిబండ (కోదాడ రూరల్)**

### ఎన్ని సార్లు అడిగినా మాఫీ కాలేదంటుండ్రు



నాకు మా గ్రామ శివారులో రెండెకరాల భూమి ఉంది. సూర్యాపేట ఎస్‌బీఐలో 78వేల రూపాయల అప్పు తీసుకున్నా. మూడు విడుతలుగా ఎదురు చూస్తున్నా. ఇప్పటికీ రుణ మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్తే సరైన సమాధానం చెప్తలేరు. లిస్టులో మీ పేరు లేదంటుండ్రు. ఈ కొద్దిపాటి రుణం కూడా మాఫీ కావట్లేదు. అసలు అయితయో.. కావో నమ్మకం లేకుండా పోయింది. ఆఫీసర్లను అడిగితే బ్యాంకులో అడగమంటుండ్రు. ఎన్ని సార్లు బ్యాంకుకు వెళ్లినా మాఫీ కాలేదంటున్నారు. మాలాంటి పేద రైతులకు న్యాయం చేయాలి. మాఫీ చేస్తమని చెప్పి మమ్ములను మోసం చేస్తున్నరు. మా రైతుల ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుద్ది. రైతులందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

**- కొప్పు భాగ్యమ్మ, రైతు, గుంజలూరు, చివ్వెంల మండలం**

### రూ.84వేల అప్పు ఉన్నా రుణమాఫీ కాలేదు



నాకు అన్నారం ఎస్‌బీఐ బ్యాంకులో రూ.84వేల పంట రుణం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు సార్లు మాఫీ ప్రకటించినా రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. వ్యవసాయ అధికారులకు ఎన్నిమార్లు జిరాక్స్ కాగితాలు ఇచ్చినా లిస్ట్‌లో నా పేరు రాలేదు. ప్రభుత్వం అందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని చెబుతుంది. కానీ.. నాకు రూ.84వేలు ఉన్నా మాఫీ కాలేదు.

**- మామిడి ఆండాలు, రైతు, అనంతారం, పెన్‌పహాడ్ మండలం**

### అధికారంలోకి రాగానే మాట మార్చిండ్రు



అన్నారం ఎస్‌బీఐ బ్యాంకులో పంట రుణం తీసుకున్న. అసలు, వడ్డీ కలిపి రూ.1.45 లక్షలు అయ్యిందని బ్యాంకు వారు చెప్పారు. ఆగస్టులోపు 2లక్షల రుపాయల పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు విడుతలగా చేసినా నాకు మాఫీ కాలేదు. నాకంటే ఎక్కువ వడ్డీ అయినోళ్లకు మాఫీ వచ్చింది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాగానే మాట మార్చిండ్రు.

**- బైరెడ్డి నాగార్జున్‌రెడ్డి, రైతు, అనంతారం, పెన్‌పహాడ్ మండలం**

### ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు



మొదటి విడుతలో ప్రకటించిన రైతు రుణమాఫీలో నాకు కాకపోవడంతో రెండో విడుతలో అవుతుందని ఆశతో ఎదురుచూసిన. అయినా నా పేరు రాలేదు. కెనరా బ్యాంకులో రూ.లక్షా 70వేల రుణం తీసుకున్నా. ప్రతి సంవత్సరం వడ్డీ చెల్లిస్తూ రెన్యూవల్ చేస్తున్నా. రుణమాఫీ కావడం లేదని బ్యాంకుల చుట్టూ పలుమార్లు తిరిగినా నిరాశే ఎదురైంది.

**- దాసరి వెంకటయ్య, రైతు, తూర్పుగూడెం, తుంగతుర్తి మండలం**

### రుణమాఫీలో నాకు అన్యాయం జరిగింది



కెనరా బ్యాంకులో నా భార్య పేరు మీద లక్షా 90వేల రూపాయల రుణం తీసుకున్నాం. వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ప్రభుత్వం రూ.2లక్షల వరకు అందరికీ రుణమాఫీ చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అధికారులను అడిగితే జాబితా పంపించామని చెప్పారు. మిత్తి పెరుగుతున్నది. రెండు నెలలుగా తిరుగుతన్నా. నాలుగో విడుత వచ్చిందంటే మళ్లీ వచ్చాను. ఇప్పుడు కూడా రుణమాఫీ కాలేదు. రైతు భరోసా లేదు. దీంతో మరింత అప్పుల పాలయ్యం. రుణమాఫీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- గుంటి రవికుమార్, రైతు, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం**

### రూ.75వేలు కూడా కావట్లేదు



ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ నాకు రాలేదు. కెనరా బ్యాంకులో రూ.75వేల రుణం తీసుకున్నా. ప్రతి సంవత్సరం బ్యాంకుకు వడ్డీ చెల్లిస్తూ రెన్యూవల్ చేస్తున్నా. అయినా ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ కావడం లేదు. ఎన్నిసార్లు బ్యాంకు చుట్టూ, వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.

**- గుగులోతు బాలూనాయక్, రైతు, దేవునిగుట్టతండా, తుంగతుర్తి మండలం**

### అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు



నాకు, నా భార్యకు కలిపి ఐదెకరాల పొలం ఉంది. అందులో సగం పత్తి, సగం వరి పండిస్తాం. మా గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంకులో నేను రూ.75వేలు, నా భార్య పేరున లక్ష రూపాయల రుణం తీసుకున్నాం. ఇద్దరికీ కలిపి వడ్డీతో 2లక్షల రూపాయల వరకు అయ్యింది. మాకు రేషన్ కార్డు కూడా ఉంది. కానీ.. రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే వ్యవసాయ శాఖ అధికారులను కలువమన్నరు. వారిని కలిస్తే ప్రాసెసింగ్‌లో ఉంది.. వచ్చే లిస్టులో అయితదీ, ఇంకో లిస్టులో అయితదని చెప్పారు. కొత్తగా వచ్చిన లిస్టులో కూడా నాకు గానీ, నా భార్యకు గానీ రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే 5వ లిస్టు వస్తదని అంటున్నరు. గ్రామంలో ఏమో పూర్తిగా అయిపోయిందని చెప్తున్నరు. కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకపోవడం భావ్యం కాదు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

**- పిట్టల చిన్న సైదులు, జాన్‌పహాడ్, పాలకవీడు మండలం**

## 7న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

● పలు అభివృద్ధి పనుల ప్రారంభం
● ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

నల్లగొండ, డిసెంబర్ 3 : జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7న జిల్లాకు రానున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి నల్లగొండకు వస్తుండడంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనకు సంబంధించి కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌తోపాటు జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎల్‌బీసీలో నిర్మించిన మెడికల్ కళాశాల, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్, స్కిల్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఆయా కార్యక్రమాల ఇన్‌చార్జ్‌లు ఏర్పాట్లు చేయడంతోపాటు బహిరంగ సభ వద్ద సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, డీఆర్‌ఓ అమరేందర్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలో శ్రీకాంతాచారి విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

## శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 3 : మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని పురస్కరించుకుని నల్లగొండలోని గడియారం సెంటర్‌లో మంగళవారం ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంచర్ల మాట్లాడుతూ శ్రీకాంతాచారి కాంగ్రెస్ పార్టీ వైఖరి కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇక రాదేమోనని ప్రాణత్యాగం చేశాడన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి, కేసీఆర్ నాయకత్వానికి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు సింగం రామ్మోహన్, కౌన్సిరల్ మారగోని గణేశ్, కో ఆప్షన్ సభ్యుడు జమాల్ ఖాద్రి, నాయకులు పాల్గొన్నారు. గడియారం సెంటర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహానికి అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు నివాళి అర్పించారు.



దామరచర్ల గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

## సమస్యలకు నిలయాలుగా గురుకులాలు

● విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం
● అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థుల అవస్థలు
● బీఆర్‌ఎస్‌వీ గురుకుల బాట ఇన్‌చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామియాదవ్

దామరచర్ల, డిసెంబర్ 3 : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వెలుగొందిన గురుకులాలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యలతో సతమతమవుతున్నాయని బీఆర్‌ఎస్‌వీ గురుకుల బాట ఇన్‌చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను బీఆర్‌ఎస్‌వీ బృందం మంగళవారం సందర్శించింది. గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అద్దె భవనంలో నిర్వహిస్తున్న దామరచర్ల గురుకుల బాలుర పాఠశాలకు ప్రహరీ లేదని, విద్యార్థులు పడుకోవడానికి వసతులు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంటు లేక విద్యార్థులు డ్రమ్ముల్లో నీళ్లు పోసి కంచాలతో తాగుతున్నారని, కూరగాయలు, భోజనం సరిగ్గా లేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. నిర్వహణ లోపంతో 11నెలల్లో 48 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని తెలిపారు. గత కేసీఆర్ పాలనలో 300 ఉన్న గురుకులాలను వెయ్యికి పెంచి అన్ని వసతులు, సదుపాయలు కల్పించి నాణ్యమైన భోజనం అందించారని చెప్పారు. ఇప్పటికైనా గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ డి.నారాయణరెడ్డి, ఆంగోతు హాతీరాంనాయక్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనూనాయక్, నాగార్జున, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి ధనావత్ ప్రకాశ్‌నాయక్, బీఆర్‌ఎస్‌వీ బృందం నాయకులు మితున్ ప్రసాద్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

## ప్రారంభించాల్సిన పనులకు మళ్లీ శంకుస్థాపన

● బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు
● మరోసారి ప్రారంభించేందుకు ఎమ్మెల్యే యత్నం



చొల్లేరు- జమ్మాపురం రోడ్డు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 3 : గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై శంకుస్థాపన చేసి ప్రారంభించాల్సిన పనులకు మరోసారి శంకుస్థాపన చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యత్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు పనులకు ఇదే రీతిలో శంకుస్థాపన చేయగా తాజాగా చొల్లేరు గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు పనులకు తిరిగి శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని చొల్లేరు గ్రామం నుంచి జమ్మాపూర్ వరకు సుమారు 1.8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గతేడాది సెప్టెంబర్ 30న డీఎంఎఫ్ కింద రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి జీఓ జారీ చేశారు. 2023 అక్టోబర్ 6న అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతలోనే ఎన్నికలు రావడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు చేపడితే ఆ పార్టీకి పేరు వస్తుందన్న అక్కసుతో తమ ప్రభుత్వమే మంజూరు చేసిందని ప్రజలను మభ్యపెట్టేందుకు తిరిగి శంకుస్థాపన చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే పూనుకున్నారని మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, చొల్లేరు మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, గ్రామస్తులు ఆరోపించారు. ఏడాది క్రితమే పనులు కొనసాగిస్తే ఇప్పటికి పనులు పూర్తయి రోడ్డు అందుబాటులోకి వచ్చేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సొంత డబ్బా కొట్టుకునేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని మండిపడ్డారు. వీలైతే నిధులు మంజూరు చేసి కొత్త పనులు చేపడితే బాగుంటుందని హితవు పలికారు.

## దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్న మోదీ

● ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ విజయోత్సవాలా?
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, డిసెంబర్ 3 : కేంద్రంలోని మోదీ సర్కార్ దేశ ప్రజల సంపదను కార్పొరేట్లకు, అదానీ, అంబానీకి దోచి పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ పెద్దలకు అదానీ గ్రూప్ భారీగా ముడుపులు ముట్టజెప్పిందని అమెరికా కోర్టులో కేసు నమోదైందన్నారు. అదానీ వ్యవహారం దేశానికి అప్రతిష్టగా మారిందని, దీనిపై ఇప్పటికీ ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం శోచనీయమని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా విజయోత్సవాలు నిర్వహించడమేంటని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, హైడ్రా, మూసీ వంటి వాటిని తీసుకొచ్చి ప్రజల సమస్యలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. పేదలకు ముందే ఇండ్లు నిర్మించి ఇచ్చి ఆ తరువాత మూసీ ప్రక్షాళన చేయాలని సూచించారు. రేవంత్‌రెడ్డి మాటల్లోనే ప్రజాస్వామ్యం ఉందని, చేతల్లో నిర్బంధకాండ ప్రయోగిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎం పోరాటంతో ఫార్మాసిటీ రద్దు అయ్యిందని, హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచుతామని అన్నారు.

కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశ్, సయ్యద్ హాషం, కందాల ప్రమీల, ప్రభావతి, నాగార్జున, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కొంపెల్లి గ్రామంలోని జేబీ పత్తి మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## తేమ పేరుతో పత్తిలో తరుగు

● మిల్లు యాజమాన్యం తీరును నిరసిస్తూ రైతుల ధర్నా

మునుగోడు, డిసెంబర్ 3 : ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు సీసీఐ తీరుతో ఆందోళన చెందుతున్నారు. మునుగోడు మండలం కొంపెల్లి గ్రామంలో గల జేబీ పత్తి మిల్లు యాజమాన్యం తేమ సాకుతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు సుమారుగా 80నుంచి 200 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పత్తిని కొనుగోలు చేయకుండా తిరిగి పంపిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు మంగళవారం మిల్లు వద్ద ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు అక్కడికి వచ్చి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ పత్తి క్వింటాలుకు రూ.7,521 ధర నిర్ణయించిందన్నారు. 9నుంచి 12శాతం వరకు తేమ ఉంటే ఒక్కొక్క శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. ధాన్యం మాదిరిగా పత్తి ఆరబెట్టుకునే పరిస్థితి ఉండదని, సీసీఐ లేదంటే ప్రైవేటుగా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ఎలక్ట్రానిక్ కాంటాల వినియోగంలో వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. జేబీ పత్తి మిల్లులో సీసీఐ అధికారులు, మిల్లు యాజమాన్యం, మధ్య దళారులు కలిసి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. తేమ సాకుతో కోత విధించిన పత్తిని రశీదులో చూపకుండా తరుగును తీసేసి రశీదు ఇస్తున్నారని తెలిపారు.